క్లుప్తంగా

కాలనీ సమస్యలను పరిష్కరించండి



ఎమ్మెల్యేతో కౌన్సిలర్ చంద్రారెడ్డి, కాలనీ వాసులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని మైత్రి హోమ్స్ కాలనీలో సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు కోరారు. మున్సిపల్ కౌన్సిలర్‌లు చంద్రారెడ్డి, గోపాలమ్మ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ అధికారులను కలిసి వినతి పత్రం అందించారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అనుమతులు తీసుకొని చేపట్టిన నిర్మాణాలకు మున్సిపల్ నిబంధనల ప్రకారం ఇంటి పన్నులు చెల్లిస్తున్నామని, అయినా మున్సిపల్ అధికారులు కాలనీలో స్ట్రీట్‌లైట్, పారిశుధ్య నిర్వహణ చేపట్టడంలేదని అన్నారు. కాలనీలో మున్సిపల్ ఆధ్వర్యంలో పనులు చేపట్టేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

పటాన్‌చెరు టౌన్: మున్సిపల్ పరిధిలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో రూ.34 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణం త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలన్నారు. డివిజన్‌లో సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్, రాజి రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న సంగమేశ్వర్ పాటిల్

రాయికోడ్(అందోల్): కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చేయించుకోలేని పేదలకు సీఎంఆర్ఎఫ్ వరమని సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సంగమేశ్వర్ పాటిల్ అన్నారు. రాయికోడ్ ఎంపీపీ కార్యాలయం వద్ద శనివారం బీఆర్‌ఎస్ నాయకుడు నారాయణతో కలిసి శనివారం ఆయా గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు రూ.4,05,000ల విలువ గల చెక్కులను అందజేశారు.

కనీస వేతనం అమలు చేయాలి

పటాన్‌చెరు టౌన్: కార్మిక చట్టాల ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండు రంగారెడ్డి డిమాండ్ చేశారు. మార్చి 6న నిర్వహించనున్న మహాధర్నా గోడ పత్రికను శనివారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్, బీమా సేవలు అందడంలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతన పెంపు లేదని విమర్శించారు. మహాధర్నాలో కార్మికులందరు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మనోహర్, గంగాధర్, విష్ణు, రామచందర్, కార్మికులు పాల్గొన్నారు.

డిక్షనరీలు అందజేత



డిక్షనరీలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని ర్యాకల్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు ఖేడ్‌కు చెందిన మిరియాల ప్రభాకర్ గుప్తా అందించిన ఇంగ్లిష్‌- తెలుగు డిక్షనరీలను శనివారం పంపిణీ చేశారు. దాతల సహకారంతో పాఠశాలలో గత రెండు నెలలుగా స్పోకెన్ ఇంగ్లీష్ తరగతులను నిర్వహిస్తున్నారని, డిక్షనరీలు విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు.

ఉపాధి కూలీల ఆందోళన



నిరసన చేస్తున్న కూలీలు

శివ్వంపేట(నర్సాపూర్): ఉపాధి పనులు చేయకుండా ఇబ్బందులకు గురిచేయడంతో కూలీలు ఆందోళన చేశారు. ఈ సంఘటన మండలంలోని బోజ్యా గ్రామ పంచాయతీలో చోటు చేసుకుంది. తండాకు చెందిన కూలీలు చెండి గ్రామ శివారులో ఉన్న చెరువు శిఖం భూములో మట్టి తవ్వకాల పనులు నిర్వహిస్తున్నారు. శిఖం భూమిలో పనులు చేయొద్దంటూ సమీప రైతు పనులు నిర్వహించే భూమిలో నీరు వదిలారు. దీంతో శనివారం కూలీలు పనులు నిర్వహించకుండా నిరసన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఉపాధి పనులకు అడ్డంకులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కూలీలు డిమాండ్ చేశారు. చెరువు శిఖం భూములు కబ్జా చేయాలనే సంకల్పంతో పలువురు వ్యక్తులు ఉపాధి పనులు జరగకుండా చేస్తున్నారని సర్పంచ్ రాజునాయక్ ఆరోపించారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

- అధికారులపై సభ్యుల మండిపాటు
- వాడీవేడిగా వట్‌పల్లి సర్వసభ్య సమావేశం



పంచాయతీరాజ్ ఏఈ మొగులయ్యను నిలదీస్తున్న సర్పంచ్‌లు

వట్‌పల్లి(అందోల్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని ఆయా గ్రామాల సర్పంచ్‌లు పంచాయతీ రాజ్ ఏఈ మొగులయ్యను నిలదీశారు. శనివారం వట్‌పల్లి రైతువేదికలో ఎంపీపీ పత్రి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసర్వేకు సంబంధించి సర్వేయర్ రైతుల నుంచి లంచాలు డిమాండ్ చేస్తున్నాడని ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు నర్సింలు అన్నారు. మండలంలో ఉపాధ్యాయుల కొరత ఉంటే డిప్యూటేషన్‌పై ఐదుగురు ఉపాధ్యాయులను ఎందుకు ఇతర ప్రాంతాలకు పంపించారని ఎంఈఓ కృష్ణను సభ్యులు ప్రశ్నించారు. మంచిర్యాలతండా పాఠశాలలో టాయిలెట్స్ నిర్మించేందుకు స్థలాన్ని ఇప్పించాలని కోరినా పట్టించుకోవడంలేదని సర్పంచ్ దీప్లానాయక్ అధికారులపై తీరుపై మండిపడ్డారు. బిల్లులు రాక తన జేబు నుంచి పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లిస్తున్నానని కేరూర్ సర్పంచ్ చిన్నెల్లి నాగమణి ఆవేదన వ్యక్తం చేశారు. గౌతాపూర్‌లో మూడేళ్ల క్రితం వర్షానికి అంగన్‌వాడీ భవనం దెబ్బతిన్నా.. ఇంతవరకు మరమ్మతు చేపట్టడం లేదని సర్పంచ్ ఖయ్యుం ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రాజేశ్వరీ, సంగీతలను సభలో నిలదీశారు. వైస్ ఎంపీపీ నాగరాణి, ఎంపీడీఓ జగదీశ్వర్, ఎంపీఓ యూసుఫ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



ఆస్పత్రి భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

కోహీర్(జహీరాబాద్): ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణంతో కోహీర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. పట్టణంలో రూ.11.50 కోట్లతో నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రి భవన పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఆస్పత్రి అందుబాటులోకి వస్తే వికారాబాద్ జిల్లా, కర్ణాటక రాష్ట్రంలోని అనేక గ్రామాల ప్రజలకు వైద్యసేవలు అందుతాయన్నారు. ఈ నెల 6 ఆర్థిక మంత్రి హరీశ్‌రావు భవనాన్ని ప్రారంభోత్సవం చేస్తారని ఆయన తెలిపారు. భవనానికి సరిపడా నీరు అందేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నర్సింలు యాదవ్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ స్రవంతి, సర్పంచులు రాజశేఖర్, వెంకట్‌రాంరెడ్డి, నాయకులు సుభాష్‌రెడ్డి, ఎస్‌కే జావేద్, ఇజ్రాయిల్ బాబీ, వహీద్, సంపత్‌కుమార్, అస్లం జాయేద్, సందీప్‌కుమార్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయం

జహీరాబాద్: సినిమా రంగంలో స్థానిక కళాకారులకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అన్నారు. శనివారం పట్టణంలోని మహీంద్రా కాలనీలో డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్ నిర్మిస్తున్న తిరగబడరా సామీ సినిమా షూటింగ్‌ను సందర్శించి, కళాకారులతో మాట్లాడారు. శివకుమార్ కళాకారులకు అవకాశం కల్పించడంతో పాటు నెల రోజుల్లో 70 శాతం షూటింగ్‌ను జహీరాబాద్ ప్రాంతంలో తీయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్, నిర్మాత ఎం.శివకుమార్, సినీ హీరో రాజ్ తరుణ్, హీరోయిన్ మాల్వి మల్హోత్ర, ప్రతినాయకుడు మకరంద్ దేశ్‌పాండే, దర్శకుడు ఎ.ఎస్.రవికుమార్ చౌదరితో పాటు నటులు మనరా చోప్రా, రఘుబాబు, ప్రృథ్వి, ప్రగతి, గీతాసింగ్, రాజారవీంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు మంకాల్ సుభాష్, వైజ్యనాథ్, సంజీవరెడ్డి, ప్రమోద్, షిలారమేష్, రమాదేవి, మాణెమ్మ, మంజుల, ముత్యాలచందు పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ పనుల పరిశీలన

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలోని ఎల్గోయి గ్రామ శివారులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జహీరాబాద్ ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఆయనతో సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, సర్పంచ్ ఓంప్రకాశ్‌పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్ల

నారాయణఖేడ్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి, కోర్టు న్యాయమూర్తి ప్రియాంక సిరిసిల్ల అన్నారు. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ఉంటే నేరాలు తగ్గుతాయని తెలిపారు. విద్యార్థి దశనుంచే సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. ర్యాగింగ్, మాదకద్రవ్యాల వాడకం జోలికి వెళ్లవద్దని సూచించారు. ఎవరైనా వేధిస్తే ఫిర్యాదు చేయాలన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని, బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకట్‌రెడ్డి, న్యాయవాదులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్

న్యాల్‌కల్(జహీరాబాద్): విద్యతో పాటు సామాజిక, ఆర్థిక అంశాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ రూరల్ సీఐ ఎన్.వెంకటేష్ అన్నారు. శనివారం మెటల్‌కుంట జెడ్పీహెచ్ఎస్ సైబర్ నేరాలు, మూఢ నమ్మకాలు, బాల్య వివాహాలు, దొంగతనాలు, పోక్సో చట్టం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చట్టాలపై అవగాహన లేక చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలకు బాల్య వివాహాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏవైనా ఇబ్బందులుంటే 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో హద్నూర్ ఎస్ఐ వినయ్‌కుమార్, సర్పంచ్ పీటర్‌రాజు, హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): ఈ నెల 16వ తేదీ నుంచి 18వ వరకు నర్సాపూర్ మండలం రుస్తుంపేట శ్రీశ్రీశ్రీ ఆత్మానందాశ్రమ పీఠాధిపతి వెంకటస్వామి ఆధ్వర్యంలో లక్ష్మీ నర్సింహ్మా స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కల్యాణోత్సవానికి సంబంధించిన కరపత్రాలను శనివారం తాటిపల్లి, చిన్నచల్మెడ, బుస్సారెడ్డిపల్లి, మక్త క్యాసారం, గార్లపల్లి, పెద్దలోడి, పొల్కంపల్లి గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. 16న ప్రభాతసేవ, గురుపూజ, గోపూజ, గణపతి పూజ, 17న కల్యాణోత్సవం ఉంటుందని, 18న గురుపూజ, శ్రీ స్వామి వారి రథోత్సవ కార్యక్రమం ఉంటాయని ఆత్మానందాశ్రమ అధ్యక్షుడు గుర్రాల భానుప్రకాశ్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరిహారం



చెక్కులను అందిస్తున్న పరిశ్రమ యాజమాన్యం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడ మైలాన్ లేబొరేటరీస్ పరిశ్రమలో జనవరి 8న జరిగిన అగ్ని ప్రమాదంలో వెస్ట్‌బెంగాల్‌కు చెందిన పరితోష్ మెహతా, బీహార్‌కు చెందిన రంజిత్‌కుమారు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు పరిశ్రమ ప్రతినిధులు జ్యోతి బాబు, ఎన్ఎం రావ్, డీసీఎల్ రవీందర్‌రెడ్డి రూ.60లక్షల చొప్పున రూ.1.20కోట్ల చెక్కులను అందించారు.

ఆర్థిక సాయం

జిన్నారం(పటాన్‌చెరు): దోమడుగు గ్రామానికి చెందిన నర్సయ్య అనారోగ్యంతో శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రూ.10వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు సర్పంచ్ రాజశేఖర్, టీఆర్‌ఎస్ నేత మురళీ శనివారం మృతుడి కుటుంబానికి నగదును అందించారు.

'పది' విద్యార్థులకు మోడల్ టెస్ట్

కొండాపూర్(సంగారెడ్డి): జీవశాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వివిధ స్థాయిల్లో బయోలజీ మోడల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ఫోరం జిల్లా అధ్యక్షుడు మురళీ, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఈ నెల 6న పాఠశాల స్థాయిలో, 9న మండల స్థాయి, 11న జిల్లా స్థాయిలో పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రశ్నాపత్రంలో 40 బహులైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయని, గంట సమయంలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ పరీక్ష ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కంప్యూటర్ శిక్షణ ప్రారంభం

నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణంలోని పాత ఐకేపీ భవనంలో కంప్యూటర్ కోర్సుకు సంబంధించి మూడో బ్యాచ్ శిక్షణ ఈనెల 6నుంచి ప్రారంభం అవుతుందని శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ జైపాల్ తెలిపారు. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌లో శిక్షణ ఇస్తామని, ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 70362 55867 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

జహీరాబాద్ టౌన్: తెలంగాణ మైనార్టీ గురుకులాల్లో కిచెన్ స్టాఫ్, హౌస్ కీపింగ్ ఉద్యోగాలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నరసింహ తెలిపారు. పూర్తి బయోడేటాతో సంగారెడ్డి కాశీంపూర్‌లో మైనార్టీ గురుకుల పాఠశాల ఆర్‌ఎల్‌సీ కార్యాలయంలో కాని, 98491 48961, 76739 17990 నంబర్లలో సంప్రదించాలన్నారు.

◆ ప్రాముఖ్యత తెలిపేలా ఉత్సవాలు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం కొండాపూర్ పంచాయతీ పరిధిలోని శివార్‌సంద్ తండా సేవాఘడ్ దక్షిణ కాశీమాత ఆలయంలో ఈనెల 6, 7 తేదీల్లో హోలీ జాతర మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి జగదీశ్వరానంద్ మహరాజ్ తెలిపారు. 6న హోలీ పరదా పండుగ ప్రాముఖ్యతను తెలిపే మహారాష్ట్ర భక్తులతో ఆటా, పాటా ప్రదర్శనలు, అఖండహరినామ సప్తాహ, 7న తెలంగాణ గోర్ బంజారా సంస్కృతీ సంప్రదాయాలతో హోలీ ప్రాముఖ్యత తెలిపేలా ఆటపాటలు, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు.

◆ వెంకటాచల క్షేత్రంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణతో వెంకటాపూర్ శివారు వెంకటా చల క్షేత్రం మారుమోగింది. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ మాణిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం

జహీరాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. శనివారం జహీరాబాద్‌లోని పలు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి, ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శామయ్య, సువర్ణ, సమియుద్దీన్, సిరాజుద్దీన్, ప్రశాంత్‌కుమార్, వెంకట్‌రావు, బద్రుద్దీన్, విజయ్, యాదయ్య, వికార్, శ్యాంసుందర్, విట్టల్, షఫియుద్దీన్ పాల్గొన్నారు.

◆ జీవాలకు టీకాలు వేయించాలి

న్యాల్‌కల్(జహీరాబాద్): జీవాలకు వ్యాధులు రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని న్యాల్‌కల్ పశు వైద్యాధికారి అజింక్యా అన్నారు. శనివారం హద్నూర్ తండాలో గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. మండలంలో 15,386 జీవాలకు నట్టల నివారణ మందు వేసినట్లు తెలిపారు. రైతులు, పశు పోషకులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ ఘనంగా వార్షికోత్సవం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారు జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో శుక్రవారం రాత్రి గురుకుల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, స్కిట్లు, పాటలు, మోనోయాక్షన్‌లు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ లక్ష్మాగౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని సాధన కోసం కృషి చేయాలని అన్నారు.

◆ కళాశాలలో పాటల పోటీలు

నర్సాపూర్‌రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నర్సాపూర్ పెద్ద చింతకుంటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు పాటల పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారిత విభాగం ఆధ్వర్యంలో ఐసీడీఎస్ నర్సాపూర్ వారితో పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రిన్సిపాల్ దామోదర్ మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

◆ కంప్యూటర్ల అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పిల్లుట్ల ప్రాథమిక పాఠశాలకు కూకట్‌పల్లికి చెందిన దాత శైలేందర్‌గుప్తా రెండు కంప్యూటర్లను శనివారం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలకు మౌళిక వసతుల కల్పన కోసం దాతల సహాయం మరిచిపోలేనిదని సర్పంచ్ రవి అన్నారు. అనంతరం దాతను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శివశంకర్, పాఠశాల చైర్మన్ మధు, తదితరులు ఉన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



క్రీడాకారులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. ఎండీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల కోసం క్రికెట్ పోటీలను ఏర్పాటు చేయడంపై నిర్వాహకులను అభినందించారు. సీఎం కేసీఆర్ క్రీడా రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని, పటాన్‌చెరులో మూడు మినీ స్టేడియాలు నిర్మిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, అమీన్‌పూర్ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దశరథ రెడ్డి, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, చంద్రశేఖర్, ఎండీఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు పృథ్వీరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పాలన దినోత్సవం



చక్రియాల పాఠశాలలో ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం అన్నారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం భిక్షపతి ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు విద్యా బోధన చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు.

చక్రియాల పాఠశాలలో..

పుల్‌కల్(అందోల్): చౌటకూర్ మండలం చక్రియాల ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం బాల్‌రాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు బోధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంగా సుశాంత్, టీచర్లుగా సౌజన్య, భువనేశ్వరి, సింధు, ప్రియ, హర్షిత, మోహన్, మహేందర్, మల్లేశం, మహేశ్, నవీన్, సంతోష్‌కుమార్, పీఈటీగా నిశాంత్ విధులు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు యాదగిరి, మోతీలాల్, బుచ్చమ్మ, లోకేశ్వరిబాయి పర్యవేక్షించారు.

గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి చర్యలు



గ్రామ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

జిన్నారం(పటాన్‌చెరు): గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని జిన్నారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె కృష్ణ తెలిపారు. మండలంలోని జంగంపేటలో శనివారం కార్యకర్తలతో సమావేశమైయ్యారు. గ్రామ అధ్యక్షుడిగా మహేష్‌ను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను కార్యకర్తలు ప్రజలకు వివరించాలని సూచించాడు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేసి అధికారం లక్ష్యంగా ముందుకు సాగాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ రవీందర్‌గౌడ్, వైస్ ఎంపీపీ గంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తారా కళాశాలలో 'క్లీన్ ఇండియా'



కళాశాల ఆవరణలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): జిల్లా కేంద్రంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం క్లీన్ ఇండియా కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ తెలిపారు. పరిసరాల పరిశుభ్రపై విద్యార్థులకు అవగాహన కల్పించేదుకు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని, ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బ తింటుందని అన్నారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ప్లాస్టిక్‌ను తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డా.జగదీశ్వర్, డా.సిద్దులు, డా.వెంకటేశం, డా.పద్మజ, డా.అభిజిత్, శివదీప్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంగ్టి సీఐపై చర్య తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నారాయణఖేడ్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డిని కించపర్చేలా వ్యవహరించిన కంగ్టి సీఐ రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఖేడ్ డీఎస్పీ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంగ్టి మాజీ ఎంపీపీ పండరినాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వినోద్ పటేల్ మాట్లాడుతూ అధికారులు నోటీసులు ఇవ్వకుండా పేదల నివాసాలను తొలగిస్తుంటే ప్రశ్నించడం తప్పా అని ప్రశ్నించారు. సీఐపై చర్యలు తీసుకోకపోతే నియోజకవర్గ వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ దారం శంకర్, నాయకులు యాదవరెడ్డి, సంగన్న, జయరాజ్, కిషన్, స్వామిదాస్, శ్రీకాంత్, శంకర్ ముదిరాజ్, నర్సింహులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిన లింగాయత్‌లు



మహాసభలో జహీరాబాద్ నాయకులు

జహీరాబాద్ టౌన్: వీరశైవ లింగాయత్‌ను ప్రత్యేక ధర్మంగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రీయ లింగాయత్ ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్రం బసవ కల్యాణ్‌లో నిర్వహిస్తున్న ప్రథమ మహాసభకు తెలంగాణ నుంచి లింగాయత్‌లు శనివారం తరలివెళ్లారు. రాష్ట్రీయ బసవదళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్ ఆధ్వర్యంలో జహీరాబాద్ నుంచి పురుషులు, మహిళలు తరలి వెళ్లారు. జహీరాబాద్ లింగాయత్ సమాజ్ నాయకులు బయలుదేరి వెళ్లారు. రెండు రోజుల పాటు కొనసాగే సభలో పీఠాధిపతులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటున్నట్లు తెలిపారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ భ్రమరాంబికమల్లికార్జునస్వామి కల్యాణమహోత్సవం, మల్లన్న జాతర ఏర్పాట్లను శనివారం కార్పొరేటర్ పుష్ప పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

విరాళం..

పట్టణంలోని శ్రీనివాస్‌నగర్ కాలనీలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ శనివారం రూ.25 వేల విరాళం అందించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఆయనకు ఆహ్వాన పత్రం అందించారు. కార్యక్రమంలో భిక్షపతి, జంగయ్య, నరసింహులు, యాదగిరి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలి

హత్నూర(సంగారెడ్డి): ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న కబ్జాలు, ఆక్రమణలు అడ్డుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ కన్వీనర్ మిట్టపల్లి రాజేశ్వర్ అన్నారు. మండలంలోని దౌల్తాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ భూముల్లో అక్రమంగా వెంచర్లు ఏర్పాట్లు చేస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. కొత్తగా ఏర్పడిన చిలిపిచేడ్, వెల్దుర్తి మండలాల ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వీటికి పక్కా భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అరబిందో, ఎస్.బి.ఆర్, కోలెంట్, పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. నర్సాపూర్, హత్నూర, కౌడిపల్లి కొల్చారం, వెల్దుర్తి, చిలిప్‌చెడ్ మండలాల్లో ఆయా పత్రికల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వం 300 గజాల స్థలం అందించాలన్నారు.